సాక్షి
కరీంనగర్
శుక్రవారం । 24 । నవంబర్ । 2023



నృసింహుని సేవలో..

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని గురువారం పెద్దపెల్లి జిల్లా ఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ శ్రీధర్ దర్శించుకున్నారు.



పదో రోజుకు గంగాహారతి

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగాహారతి గురువారం పదో రోజుకు చేరింది.

గరిష్టం/కనిష్టం
32.0/27.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎంసీహెచ్‌లో కోడ్ ఉల్లంఘనపై విచారణ

కరీంనగర్‌టౌన్: బతుకమ్మ సంబరాల్లో భాగంగా గత నెల 20న మాతాశిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) ఆవరణలో జరిగిన వేడుకల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘించడాన్ని ఎలక్షన్ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఆర్ఎంవో డాక్టర్ జ్యోతి, అదనపు ఆర్ఎంవో డాక్టర్ నవీన ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించారన్న ఫిర్యాదు మేరకు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్ ఇద్దరు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. పిల్లల వైద్యుడు అజయ్‌కుమార్, రేడియాలజిస్టు రవీందర్ నేతృత్వంలో గురువారం ఎంసీహెచ్‌లో విచారణ చేపట్టారు. నివేదికను శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు అందించనున్నారు. దాని ఆధారంగా చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

కరీంనగర్‌సిటీ: ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, తెలుగు, ఎకనామిక్స్, ఎమ్మెస్సీ మ్యాథ్స్, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, మైక్రో బయాలజీ , ఎం.కాం. కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 2023–24 సీపీజీఈటీ ర్యాంక్ కార్డు, టీసీ తదితర ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో ఈ నెల 25లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సీటు పొందిన విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు రూ.2,100తోపాటు సంబంధిత కోర్సు వార్షిక ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు. వీరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని తెలిపారు.

క్వింటాల్ పత్తి రూ.6,850



మిల్లులో కొనుగోలు చేసిన పత్తి

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి గరిష్ఠంగా ధర రూ.6,850 పలికింది. గురువారం మార్కెట్‌కు 100 వాహనాల్లో 1,139 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,700, కనిష్ట ధర రూ.6,200ను వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో 10 మంది రైతులు 20 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,400, మోడల్ ధర రూ.6,150, కనిష్ట ధర రూ.6 వేలకు కొనుగోలు చేశారు.

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే

- నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్, కేటీఆర్ చెలగాటమాడారు..
- ఈసారి ప్రణవ్, సత్యనారాయణలను గెలిపించండి
- పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- జమ్మికుంట, రేణికుంటల్లో కాంగ్రెస్ విజయభేరి సభలు



రేణికుంటలో రేవంత్ రెడ్డి, కవ్వంపల్లి



జమ్మికుంటలో మాట్లాడుతున్న ప్రణవ్

హుజూరాబాద్/తిమ్మాపూర్: ఈ అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌ను మార్చేవని, ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణలో వచ్చేది ఇందిరమ్మ రాజ్యమేనని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభకు ఆయన హాజరై, మాట్లాడారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు గత ఉప ఎన్నికల్లో పోటీ చేసిన బల్మూరి వెంకట్‌ను అభినందించారు. హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్‌ను గెలిపిస్తే పక్క చూపులు చూస్తున్నాడన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వేల కోట్ల రూపాయలు తీసుకొచ్చి, అభివృద్ధి చేస్తా అన్నాడు.. చేశాడా అని ప్రశ్నించారు. ఇక్కడి ప్రజలు కష్టపడి, 2018లో కాంగ్రెస్‌కు 60 వేల ఓట్లు వేస్తే కమీషన్లు, ఇసుక కాంట్రాక్టులు, ఎమ్మెల్సీ పదవి కోసం పార్టీకి నమ్మకద్రోహం చేశాడని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ప్రణవ్‌ను గెలిపిస్తే హుజూరాబాద్ అభివృద్ధి బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో దద్దమ్మలను పెట్టి, నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్, కేటీఆర్ చెలగాటమాడారని మండిపడ్డారు.

ఖాళీల భర్తీలో బీఆర్ఎస్ విఫలం : కోదండరాం

ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ నెరవేర్చారని తెలిపారు. మిగులు నిధులున్న రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఇంజినీర్లు కాకుండా కేసీఆర్ కట్టిండు కాబట్టే కుంగిపోతోందని ఎద్దేవా చేశారు. హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా ఏర్పాటు చేయని ఆయనకు ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. లిక్కర్ కేసులో కవితను కేంద్ర ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయలేదో చెప్పాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనన్నారు. ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించి, కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరారు.

బీఆర్ఎస్, బీజేపీ దొందూ దొందే : వొడితెల ప్రణవ్, కాంగ్రెస్ అభ్యర్థి

బీఆర్ఎస్, బీజేపీ దొందూ దొందే అని, బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్ ఆరోపించారు. బీఆర్ఎస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. హుజూరాబాద్ అభివృద్ధికి ఈ రెండేళ్లలో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి ఎందుకు నిధులు తీసుకురాలేదో చెప్పాలన్నారు. ఈటలను గెలిపిస్తే ఇక్కడి ప్రజలను మోసం చేసి, గజ్వేల్‌కు వెళ్లాడని పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు మద్దతు తెలిపి, తనకు ఈసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు.

దొరల పాలన పోవాలి

తెలంగాణలో దొరల పాలన పోవాలని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట శివారులో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభకు హాజరయ్యారు. తెలంగాణలో డిసెంబర్ 9న ఇందిరమ్మ రాజ్యం తెస్తామన్నారు. కేసీఆర్‌కు దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్టును చూపించి, ఓట్లడగాలని సవాల్ చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తెలంగాణ పాటను గడీలో బందీ చేశాడని మండిపడ్డారు. తనను గెలిపిస్తే మానకొండూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ప్రతీ మండలంలో 30 పడకల ఆస్పత్రి, జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు, తోటపల్లి బాధితులకు న్యాయం చేస్తామని, బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి పురమల్ల శ్రీనివాస్, రాష్ట్ర మహిళా నాయకురాలు కవ్వంపల్లి అనురాధ, సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అందరూ ఓటెత్తాలి

సాక్షి పీపుల్స్ ఎజెండా

కరీంనగర్‌సిటీ: ఏ రకమైన ఎన్నికలు జరిగినా గెలుపోటములు నిర్ణయించేది ఓటర్లు మాత్రమే. ఓటును సక్రమంగా వినియోగించడం ద్వారా ప్రజాస్వామ్యానికి దారులు వేసేది కూడా వారే. ఓటు హక్కును వినియోగించడంపై ఒకపక్క ప్రభుత్వ యంత్రాంగం.. మరోపక్క అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. గతంలో జరిగిన పోలింగ్ శాతం పరిశీలిస్తే ఎంత అవగాహన కల్పించినా ఓటర్లు ముందుకు రాక పోలింగ్ శాతం తగ్గిపోతోంది. ఓటర్లు చాలామంది ముఖ్యంగా నగరాల్లో ఉండేవారు పోలింగ్ తేదీని ఒక సెలవు రోజు అని చూడకుండా మన భవిష్యత్తును నిర్ణయించే గొప్ప రోజుగా చూడాలని పలువురు పేర్కొంటున్నారు. ఓటు ద్వారా ప్రజాస్వామ్యాన్ని రక్షించి అభివృద్ధికి బాటలు వేయడానికి అవకాశంగా మార్చుకోవాలని ప్రభుత్వ అధ్యాపకులు అవగాహన కల్పిస్తున్నారు. పోలింగ్ తేదీని మేము గొప్పగా చూస్తామని, ఐదేళ్లకోసారి వచ్చే పండుగలా ఉంటుందని వారు సాక్షితో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

అభివృద్ధికి బాటలు వేయాలి



ఓటు హక్కు వినియోగించుకొని మంచి నాయకుడిని ఎన్నుకోవడం ద్వారా అభివృద్ధికి బాటలు వేసే మంచి అవకాశంగా భావించాలి. మనం వేసే ఒక్క ఓటు ప్రజాస్వామ్య రక్షణకు నాంది పలుకుతుంది. నేను ఒక్కడినే ఓటేస్తే మార్పు వస్తుందా అంటూ వెనకడుగు వేయొద్దు.

– డా.శ్రీలక్ష్మి, కరీంనగర్ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కరీంనగర్

ఓటు మారలే..



దేశంలో ప్రతీ ఐదేళ్లకోసారి నాయకుడిని ఎన్నుకునే ఓటు విషయంలో ఏమాత్రం మార్పు రాలేదు. సాంకేతికంగా ఎంత అభివృద్ధిని సాధించినా.. ఓటు ప్రాముఖ్యం తగ్గలేదు. సంఘంలో మార్పు జరగాలంటే ఓటు ఒక్కటే ఆయుధం. మంచి నాయకుడికి ఓటేయడం ద్వారా అభివృద్ధి సాధించడానికి.. భవిష్యత్తు తరాలు ముందుకు సాగడానికి బాటలు వేసినవారమవుతాం.

– డా.రామకృష్ణ, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్, కరీంనగర్

సెలవు రోజుగా భావించొద్దు



చాలామంది పోలింగ్ రోజును సెలవు రోజుగా భావిస్తుంటారు. కాని ఒక గొప్ప మార్పునకు నాంది పలికే రోజుగా భావించాలి. ఐదేళ్లకోసారి వచ్చే పండుగలా చూడాలి. మనం వేసే ఓటు వచ్చే భవిష్యత్తు తరాల రాతలు మార్చే రోజుగా ఉండాలి. మీరు వేసే ఒక్క ఓటు ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపాలి.

– రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జువాలజీ, ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్

సామాన్యుడి బలం



ఓటనేది సామాన్యుడిని కూడా అసామాన్యుడిగా చేస్తుంది. ఓటనే ఆయుధం దేశ ప్రగతిని గాడిన పెడుతుంది. మనం వేసే ఓటుతో మంచి నాయకున్ని ఎన్నుకోవడం ద్వారా గొప్ప సంస్కరణలకు నాంది పలికినవారమవుతాం. సమస్యల పరిష్కారానికి మనం ఓటు ద్వారానే సమాధానం చెప్పగలం. ఎన్ని పనులున్నా పోలింగ్ రోజు ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, కామర్స్, మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్

ఓటును సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి



హుజూరాబాద్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి అన్నారు. హుజూరాబాద్ పట్టణ పరిధిలోని బోర్నపల్లిలో 83 ఏళ్ల వృద్ధురాలు వర్దినేని చిలుకమ్మ హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా గురువారం ఆమె ఇంటికి వెళ్లారు. హోం ఓటింగ్ ఎలా వేయాలో అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లారు. ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే 22 మంది అభ్యర్థుల కోసం సిద్ధం చేసినన 763 బ్యాలెట్, 381 కంట్రోల్, 427 కమిషనింగ్ యూనిట్లు, మాక్ పోలింగ్‌ను పరిశీలించారు. పోలింగ్ రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, శంకరపట్నం తహసీల్దార్ అనుపమరావు పాల్గొన్నారు.

ముందస్తు ఓటింగ్ పరిశీలన

శంకరపట్నం(మానకొండూర్): ఎరడపల్లి గ్రామంలో ఓటర్ల ఇంటి వద్దే నిర్వహిస్తున్న ఓటింగ్‌ను జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి గురువారం పరిశీలించారు. వృద్ధులతోపాటు దివ్యాంగులు పోలింగ్ బూత్‌కు వెళ్లకుండా తమ ఇంటి వద్దే ఓటు వేసే సదుపాయాన్ని ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. తహసీల్దార్ అనుపమ పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ తనిఖీ

కరీంనగర్ అర్బన్: ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం నగరంలోని మంకమ్మతోటలో పర్యటించారు. ఓటర్లను చైతన్యపరచడంతోపాటు పోలింగ్ రోజు ఓటరు సులువుగా పోలింగ్ కేంద్రానికి చేరుకునేలా ఎన్నికల సంఘం రూపొందించిన స్లిప్పులు ఎంతగానో ఉపకరిస్తాయని అన్నారు. విధులను నిర్లక్ష్యం చేయొద్దని, సకాలంలో పంపిణీ పూర్తవ్వాలని సూచించారు. కరీంనగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ స్వరూపారాణి, సిబ్బంది ఉన్నారు.

చొప్పదండిలో బీఆర్ఎస్‌కు షాక్

- కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ చైర్‌పర్సన్
- కండువా కప్పిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



చైర్‌పర్సన్‌కు కండువా కప్పిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

చొప్పదండి: నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఆమె భర్త, మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి గురువారం తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వారికి కండువాలు కప్పి, ఆహ్వానించారు. గత కొంతకాలంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వ్యవహార శైలిపై భూమారెడ్డి అసంతృప్తితో ఉన్నారు. ప్రతీరోజు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతోపాటు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ఇప్పటికే గంగాధర జెడ్పీటీసీ, చొప్పదండి వైస్ ఎంపీపీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో రైతుబంధు సమితి అధ్యక్షుడు గుర్రం హన్మంతరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ముద్దం మల్లేశం, పిట్టల వెంకటేశ్, హన్మంతరెడ్డి, శేఖర్, మధుసూదన్ తదితరులున్నారు.

ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చొద్దు

- బీజేపీని గెలిపిస్తేనే సుస్థిర పాలన
- కరీంనగర్, రూరల్ ఏరియాలో ప్రచారం చేసిన బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



విద్యానగర్‌లో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్



గొర్రె పిల్లను బహూకరిస్తున్న నాయకులు



డోలు వాయిస్తున్న ఎంపీ సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ ఆరోపించారు. నగరంలో బీఆర్ఎస్ నేతల భూకబ్జాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నగునూరుతోపాటు నగరంలోని 17, 38, 39వ డివిజన్లలో బండి సంజయ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా బండి సంజయ్ నగునూరు, విద్యానగర్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశంలో 3 కోట్ల ఇండ్లు కట్టించింది. తెలంగాణకు 2.40లక్షల ఇండ్లు మంజూరు చేసింది. ఎవరు ప్రజల కోసం పోరాడుతున్నారో, ఎవరు భూకబ్జాలకు పాల్పడుతున్నారో బేరీజు వేయండి.. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలిద్దరూ భూకబ్జాదారులే. వారు ఎన్నికల సంఘానికి అందజేసిన అఫిడవిట్‌లోనే వారెంతటి భూకబ్జాదారులో, అక్రమ సంపాదన పరులో అర్థం చేసుకోవచ్చు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓట్లేస్తే అవన్నీ డ్రైనేజీలో వేసినట్లేనన్నారు. నన్ను అవినీతిపరుడిగా చిత్రీకరించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు కలిసి కుట్ర చేస్తున్నారు. నాపై దొంగ వీడియోలు, ఆడియోలు సృష్టించి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు.

సంజయన్నా.. మా భవిత మీరే

నియోజకవర్గంలో తొలిసారి ఓటు నమోదు చేసుకున్న యువత 'సంజయన్నా.. మా తొలి ఓటు మీకే' అంటూ ఎంపీకి హామీ ఇస్తున్నా రు. గురువారం ఆయన నివాసానికి వెళ్లిన పలు వురు ఎంపీతో ఫొటోలు దిగారు. ఆయన ఉదయం శాతవాహన యూనివర్సిటీ, ఎస్సారార్ కళాశాల మైదానానికి వెళ్లి, వాకర్స్‌ను కలిసి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నట్లు వారు చెప్పారన్నారు.

బీజేపీలో చేరికలు

బావుపేటకు చెందిన దుర్గం జగన్, ఒరుగంటి మల్లేశం ఆధ్వర్యంలో 50 మంది నాయకులు, 20వ డివిజన్ (హనుమాన్ నగర్)కు చెందిన 100 మందికి పైగా బీఆర్ఎస్ కార్యకర్తలు, 1వ డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో శేఖర్, రమేశ్, రామకృష్ణ, కుమార్, సురేశ్, మహేశ్ తదితరులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వావిలాలపల్లికి చెందిన బొంతు నరేశ్, పవన్, సాగర్, అజయ్, గణేశ్, సాయి, 29వ డివిజన్‌కు చెందిన వరికోలు మధు, ఉప్పుల ప్రదీప్, 7వ డివిజన్‌కు చెందిన చెరుకుతోట ప్రేమ్‌చరణ్, వరుణ్, ప్రణయ్, సన్నీ, సాయి అక్షయ్, బన్నీ తదితరులు సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. రాంనగర్ టెలిఫోన్ క్వార్టర్స్ మీదుగా ప్రచారానికి వెళ్తున్న ఎంపీ సంజయ్‌కి స్వరాజ్యం అనే వృద్ధురాలు ఎదురుపడి 'సంజయ్.. ఈ పైసలుంచు.. ఎన్నికల ఖర్చుకు పనికొస్తయ్..' అంటూ రూ.1,116 ఆయన చేతిలో పెట్టి, ఆశీర్వదించారు.

రేకుర్తిలో ఇంటింటి ప్రచారం

కరీంనగర్ పట్టణం 18వ డివిజన్ రేకుర్తిలోని 36, 37, 38, 39, 40వ బూత్‌లలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, నాయకులు విక్రమ్, రాజు వివేక్, విష్ణు ప్రసాద్‌రావు, ప్రతాప రెడ్డి తదితరులున్నారు.

ఆసిఫ్‌నగర్‌లో..

కొత్తపల్లి(కరీంనగర్): మండలంలోని బావుపేటలో బీజేపీ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల ఇన్‌చార్జి జాడి బాల్ రెడ్డి, నాయకులు సాగర్, నాగరాజు తదితరులున్నారు.

హైదరాబాద్ తర్వాత ఇక్కడే అభివృద్ధి

- మానేరు రివర్ ఫ్రంట్‌తో కరీంనగర్‌కు అంతర్జాతీయ స్థాయి పేరు
- బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటేస్తే అంధకారమే
- మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్



ఎలగందులలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్



మంత్రిని సన్మానిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న మంత్రి కమలాకర్

కరీంనగర్: మానేర్ రివర్ ఫ్రంట్‌తో కరీంనగర్‌కు అంతర్జాతీయ స్థాయిలో పేరు వచ్చిందని మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ అన్నారు. నగరంలోని మానేరు డ్యామ్ వద్ద గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు వాకర్స్‌తో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. కారు గుర్తుకు ఓటేసి, తనను నాలుగోసారి గెలిపించాలని కోరారు. అనంతరం రాగి జావా తాగుతూ.. కాసేపు సేద తీరారు. హైదరాబాద్ తర్వాత కరీంనగర్‌లోనే ఆ స్థాయిలో అభివృద్ధి జరుగుతోందన్నారు. మంత్రి సోదరుడు గంగుల సుధాకర్, కార్పొరేటర్ దిండిగాల మహేశ్, మాజీ కార్పొరేటర్ ఏవీ రమణ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మానేరు వాకర్స్ అధ్యక్షుడు కనకాచారి, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ రెడ్డి, లేక్ వాకర్స్ అధ్యక్షుడు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దు

కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దని, కరీంనగర్ గడ్డపై ఎగిరేది గులాబీ జెండాయేనని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం 17, 18, 19వ డివిజన్లలో మేయర్ సునీల్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి, తనను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్పొరేటర్లు కోల భాగ్యలక్ష్మి, ఏదుల్ల రాజశేఖర్, సుదగోని మాధవి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ గౌడ్, మాజీ సర్పంచ్ నందెల్లి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. మంత్రికి మద్దతుగా 22వ డివిజన్ కార్పొరేటర్ గంట కల్యాణి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు బొగ్గుల మల్లేశం, మద్దునాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లు పత్తా లేని ఎంపీ..

కొత్తపల్లి(కరీంనగర్): బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటేస్తే రాష్ట్ర భవిష్యత్ అంధకారం అవుతుందని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. 50 ఏళ్ల తెలంగాణ దరిద్రానికి ఆ పార్టీలే కారణమని ఆరోపించారు. కరెంటు వెలుగులు కావాలో.. కాంగ్రెస్ చీకట్లు కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని సూచించారు. గురువారం కొత్తపల్లి మండలంలోని శ్రీరాములపల్లి, ఎలగందలలో ప్రచారం చేశారు. ఎంపీగా బండి సంజయ్‌ను ప్రజలు గెలిపిస్తే నాలుగున్నరేళ్లు పత్తా లేకుండా పోయారని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడిగేందుకు వస్తున్నారని ప్రశ్నించారు. బీసీ ముఖ్యమంత్రి అంటూ చెప్పుకు తిరుగుతున్న బీజేపీకి రాష్ట్రంలో రెండు సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. గెలిచాక నెల రోజుల్లో శ్రీరాములపల్లిని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తానని, ఎలగందుల ఐకేపీ సెంటర్‌కు స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ పిల్లి శ్రీలత, సర్పంచ్ ఎర్రండి షర్మిల, ఎంపీటీసీ సభ్యుడు రమేశ్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, నాయకులు కాసారపు శ్రీనివాస్ గౌడ్, శంకర్, చంద్రయ్య, శ్రీరాముల నరేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ప్రచారం

కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరుతూ గురువారం కొత్తపల్లి పట్టణంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, గంగుల ప్రదీప్‌లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


రాకేశ్ (ఫైల్)

ధర్మపురి : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దాసరి లచ్చయ్య– నర్సమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు రాకేశ్ (20) ఉన్నాడు. గురువారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లాడు. సాయంత్రం ఇద్దరు స్నేహితులతో కలిసి పనినిమిత్తం బైక్‌పై వెళ్తుండగా లక్షెట్టిపేట వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారును ఢీకొట్టారు. స్నేహితులద్దరికీ స్వ ల్పగాయాలు కాగా రాకేశ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. రాకేశ్ ఇంటర్ వరకు చదివి పట్టణంలోని ఓ కిరాణ దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్నాడు. రాకేశ్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


క్షతగాత్రుడు రాజు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలో గురువారం బైక్, మారుతి ఈకో వాహనం ఢీకొట్టుకున్నా యి. ఈ ప్రమాదంలో బైక్ పై వెళ్తున్న రాజు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని సిరిసిల్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

పకడ్బందీగా కౌంటింగ్ ఏర్పాట్లు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. ఈమేరకు గురువారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పీడ్ ఇంటర్నెట్ తోపాటు, కమ్యూనికేషన్, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, ఈవీ ఎం స్ట్రాంగ్‌రూమ్, భద్రత చర్యలు, వీడియోగ్రఫీ, ఫైర్‌సేఫ్టీ, సిబ్బందికి భోజన సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధన మేరకు కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్, డీపీఆర్వో దశరథం, సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరు పరిశీలన

వేములవాడ: ఈవీఎంల పనితీరును కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ప్రభుత్వ హైస్కూ ల్‌కు చేరుకుని సిబ్బందికి పలు సూచనలు చేశారు. రిటర్నింగ్ అధికారి మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కొత్త ఓటరు కార్డులొచ్చాయ్..


కార్డులను సిద్ధం చేస్తున్న సిబ్బంది


ఎన్నికల సంఘం లేఖ


రెండు ఫొటోలతో ఓటరు కార్డు

- విభిన్నం.. వినూత్నంగా ముద్రణ
- పాత ఓటర్లతో పాటు కొత్తవారికి పంపిణీ
- తపాలాశాఖ ద్వారా ఇంటికే రవాణా

కరీంనగర్ అర్బన్: కొత్త ఓటరు కార్డులొచ్చాయ్. పాత ఓటర్లతో పాటు కొత్తవారికి వినూత్నంగా రూపొందించిన కార్డులు ఇళ్లకు చేరుతున్నాయి. పోస్టల్‌శాఖ ద్వారా స్పీడ్‌పోస్ట్ చేస్తుండగా ఓటర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత కార్డుల సిరీస్ మారిపోవడంతో కొత్తకార్డులు అనివార్యమయ్యాయి. పాతకార్డుల తాలుకూ వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోగా ఇక వచ్చిన నూతన కార్డుల సిరీస్‌లు ప్రామాణికం కానున్నాయి. జిల్లాకు 2.78లక్షల కార్డులు రాగా ఇప్పటికే సగానికి పైగా ఓటర్లకు చేరాయి. ఎప్పటికప్పుడు కొత్త కార్డులు వస్తుండగా కలెక్టరేట్ నుంచి పోస్టల్ ద్వారా ఓటర్లకు చేరుతున్నాయి. కరీంనగర్ నియోజకవర్గానికి 52వేలు, చొప్పదండికి 73వేలు, మానకొండూరుకు 71వేలు, హుజూరాబాద్‌కు 84వేల కార్డులు రాగా వాటిని బట్వాడా చేస్తున్నారు. కార్డులు, చిరునామా వేరు వేరుగా ఉండటంతో ఎన్నికల సిబ్బంది వాటన్నింటిని కలిపి పోస్ట్‌కు అనుకూలంగా మలుస్తున్నారు. 2012 కన్నా ముందున్న గుర్తింపుకార్డుల్లో 12 అంకెలుండగా, కొత్త వాటిలో 10 అంకెలున్నాయి. కాగా.. కొత్త కార్డు రాకున్నా పాత కార్డుతో కూడా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

కొత్త కొత్తగా.. విభిన్నంగా కార్డు

భారత ఎన్నికల సంఘం కొత్త ఓటర్ కార్డులను అత్యాధునిక ఫీచర్లతో అందుబాటులోకి తెచ్చింది. స్పీడ్‌పోస్ట్ ద్వారా ఓటర్లకు చేరవేస్తుండగా కొత్త ఓటరు కార్డును చూసి మురిసిపోతున్నారు. ఇందులో రెండు ఫొటోలతో ఎడమవైపు పెద్దఫొటో, కుడివైపు చిన్న ఫొటో ఉండగా ఓటరు ఫొటో స్పష్టంగా కనిపించేలా 3డీ సాంకేతికతను ఉపయోగించారు. ఈ కార్డులో హాలోగ్రామ్‌ను తొలగించడానికి వీలుండదు. వెనక ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు అన్ని వివరాలు తెలుసుకోవచ్చు. పాత ఓటరు కార్డులో పోలింగ్ బూత్ నంబరు ఉండేది. ఈ కొత్త కార్డులో పోలింగ్ బూత్ నంబర్ తీసేశారు. ఎందుకంటే ప్రతిసారి పోలింగ్ బూత్‌లు మారిపోతుంటాయి. కొత్త కార్డులో పోలింగ్ బూత్ నంబర్ వేయకపోవడంతో జీవితాంతం వాడుకోవచ్చు. గతంలో ఓటరు గుర్తింపుకార్డును ఇతరుల పేర్ల మీద మార్చి డూప్లికేటు తయారు చేసే వీలుండేది. ఇప్పుడు అలాంటి చర్యలకు పాల్పడకుండా నిర్ణీత ప్రమాణాలతో కార్డును రూపొందించారు.

ఓటు హక్కుపై ఎన్నికల సంఘం లేఖ

ప్రజాస్వామ్యంలో ఓటు విలువను గుర్తు చేస్తూ జిల్లా ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ముద్రించిన ఆంగ్లం, తెలుగు భాషలో ఉన్న మీ ఓటు–మీ హక్కు పేరుతో లేఖను గుర్తింపు కార్డుతో పంపిస్తున్నారు. ఎన్నికల్లో మీ అభీష్టం మేరకు, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని అందులో పేర్కొన్నారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేస్తానని ప్రతిజ్ఞ పత్రం, మరో సందేశాత్మక పత్రం కొత్త కార్డులతో కలిపి తపాలా శాఖ ఓటర్ల ఇంటికి చేరవేస్తోంది.

'అల్ఫోర్స్'లో అంతరిక్ష వీక్షణం


టెలిస్కోప్ ద్వారా ఖగోళాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు, నరేందర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులు గురువారం అంతరిక్ష వీక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అత్యాధునిక టెలిస్కోప్ ద్వారా ఖగోళంపై అద్భుతాలను వీక్షించారు. ఈ సందర్భంగా చందమామ, ఇతర గ్రహాలు, చంద్రయాన్–3 అడుగుపెట్టిన ప్రదేశాన్ని పరిశీలించారు. విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు సైన్స్‌పై మరింత అవగాహన పెంచడం కోసం ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెళ్లయిన ఏడాదికే యువతి ఆత్మహత్య

- డబ్బు కోసం భర్త వేధింపులే కారణం


మానస (ఫైల్)

మానకొండూర్ రూరల్: ఓ యువతి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వివరాల ప్రకారం పచ్చునూర్ గ్రామానికి చెందిన మానస (25)కు గట్టుదుద్దెనపల్లికి చెందిన పప్పు సంపత్‌తో ఏడాది క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. కానీ, ఆరు నెలలకే అదనంగా డబ్బులు తీసుకురావాలంటూ భర్త ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. దీపావళికి మానస తల్లిగారింటికి వచ్చింది. భర్త డబ్బులు కావాలని వేధిస్తున్నాడని తల్లిదండ్రులతో చెప్పింది. పండుగ మరుసటి రోజు సంపత్ పచ్చునూర్ వచ్చి, డబ్బులివ్వాలని గొడవపడి వెళ్లిపోయాడు. అప్పటినుంచి మానస పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయం చూసి, బయటకు వెళ్లిపోయింది. గురువారం తల్లిదండ్రులు వెతకగా గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో మానస మృతదేహం కనిపించింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి తీవ్ర గాయాలు

- మహిళ పరిస్థితి విషమం
- కాంగ్రెస్ సభకు వెళ్లొస్తుండగా ప్రమాదం


గాయపడిన స్వరూప

వీణవంక(హుజూరాబాద్): జమ్మికుంటలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ సభకు వెళ్లి, తిరిగి వస్తుండగా వీణవంకకు చెందిన దానవేన స్వరూప ట్రాక్టర్ పైనుంచి పడటంతో తీవ్రంగా గాయపడింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. స్వరూప తోపాటు కొందరు ట్రాక్టర్‌లో సభకు వెళ్లారు. తిరిగి వచ్చేటప్పుడు ఆమె ట్రాక్టర్ ఇంజిన్ వద్ద కూర్చుంది. వల్భాపూర్ సమీపంలోని కెనాల్ వద్దకు రాగానే ప్రమాదవశాత్తు రోడ్డుపై పడింది. ఈ ఘటనలో స్వరూప తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత


మద్యం బాటిళ్లు చూపుతున్న పోలీసులు

మానకొండూర్ రూరల్: మండలంలోని గంగిపల్లి శివారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జె.ఇంద్రప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పోలీసులు గురువారం గంగిపల్లి శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో తాళ్లపల్లి శ్రీకాంత్ తన ద్విచక్ర వాహనంపై అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. 95 మద్యం బాటిళ్లు, బైక్ సీజ్ చేశామని సీఐ పేర్కొన్నారు. అతనిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం పానకం ధ్వంసం


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఉప్పుమడుగు అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన 900 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. గ్రామ శివారులో తనిఖీలు నిర్వహించగా కుంచెపు మహేశ్ ద్విచక్రవాహనంపై 15 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేశామని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో గట్టయ్య, మోహన్‌లాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దొంగతనానికి వచ్చి.. పోలీసులు వచ్చారని

- త్రుటిలో తప్పించుకున్న ఆగంతకుడు


ఆగంతకుడి కోసం వెతుకుతున్న పోలీసులు

ధర్మపురి: చోరీకి యత్నించిన ఓ ఆగంతకుడు పోలీసుల అలికిడి విని త్రుటిలో తప్పించుకుపోయిన ఘటన గురువారం ధర్మపురిలో చోటు చేసుకుంది. పట్టణంలోని కోనేరు వెనుకభాగంలో బ్రాహ్మణ వీధిలో విశ్రాంత ఉపాధ్యాయుడు పెండాల రవికుమార్ రాజశ్రీ దంపతులు నివాసముంటున్నారు. గురువారం ఉదయం రవికుమార్ సమీపంలోని ఆలయానికి ఆలయానికి వెళ్లాడు. రాజశ్రీ కూరగాయల మార్కెట్‌కు వెళ్లింది. అదే సమయంలో ఓ వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి సామగ్రి సర్దుతున్నాడు. రాజశ్రీ ఇంటికి రాగా లోపల గడియపెట్టి ఉండడాన్ని గమనించింది. విషయాన్ని చుట్టుపక్కల వాళ్లకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ చేరుకున్నారు. పోలీసులు వచ్చిన విషయాన్ని గమనించిన ఆగంతకుడు వెనుకడోర్ నుంచి పరారాయ్యాడు. నిత్యం జన సంచారముండే బ్రాహ్మణ వీధిలో చోరీకి యత్నించడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


జల (ఫైల్)

మేడిపల్లి : భీమారం మండలంలోని కమ్మరిపేటలో అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జవ్వాజి జల (32) బుధవారం రాత్రి ఇంట్లో నిద్రకు ఉపక్రమించింది. తెల్లవారుజామున కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికారు. ఇంటి సమీపంలోని పాడుబడ్డ బావి వద్ద చేతికర్ర తో పాటు పొగ వ్యాపించడాన్ని గమనించారు. మంటలు ఆర్పివేయడంతో కాలిన శరీర ఆనవాళ్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై శ్యామ్‌రాజ్, కోరుట్ల సీఐ ప్రవీణ్ కూమార్, మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి చేరుకొని, ఘటనా స్థలంలోనే పంచనామా నిర్వహించారు. అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పోలింగ్ అధికారులకు ఈసీ సూచన

జగిత్యాలజోన్ : ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు, పోలింగ్ అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం పలు సూచనలు చేసింది. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఏ పార్టీకాని, అభ్యర్థి గాని ప్రచారం చేయరాదు. కేంద్రానికి వందమీటర్ల పరిధిలో వివిధ పార్టీల బ్యానర్లు, జెండాలు, గోడల మీద రాతలు, పోస్టర్లు లేకుండా చూడాలి. పోలింగ్ బూత్‌లో దేశ నాయకుల చిత్రపటాలు ఉంచొద్దు. అభ్యర్థుల జాబితా గుర్తులున్న పోస్టర్‌ను బూత్ ముందు ఓటర్లకు కనిపించేలా అతికించాలి. గదిలో సరైన వెలుతురు ఉండేలా చూడాలి. పోలింగ్ బూత్‌లోకి ఏజెంట్లు, సిబ్బంది, సెల్‌ఫోన్లు, వైర్‌లెస్, కార్డ్ లెస్ ఫోన్లు, వీడియో కెమెరాలు తీసుకెళ్లకూడదు. సంబంధం లేని వ్యక్తులను పోలింగ్‌స్టేషన్‌లోకి అనుమతించరు. అధికారులు ఓటు వేసేటప్పుడు ఓటింగ్ గదిలోకి వెళ్లరాదు. ప్రతి రెండు గంటలకోసారి అప్పటి వరకు పోలైన ఓట్ల వివరాలను జోనల్ ఆఫీసర్‌కు తెలపాలి. ఏజెంట్లు బూత్‌లో కూర్చుండే విషయంలోనూ తొలుత జాతీయ పార్టీ, తర్వాత రాష్ట్ర పార్టీ, అనంతరం స్వతంత్రులకు వరుసగా అవకాశం కల్పిస్తారు. పార్టీలకు సంబంధించిన దుస్తులు, టోపీలు, బ్యాడ్జీలు, కండువాలను తీసుకెళ్లవద్దు.

నిర్భయంగా ఓటు వేయండి


మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం):ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్ కోరారు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఇందుకోసం పోలీసు శాఖ శాంతియుత వాతావరణం కల్పిస్తుందని తెలిపారు. ఈమేరకు భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టూటౌన్ పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భార్య మాట వినలేదని భర్త బలవన్మరణం

- అనంతపల్లిలో విషాదం


బాబు (ఫైల్)

చందుర్తి(వేములవాడ): తన మాట భార్య వినలేదని మనస్థాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అనంతపల్లిలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. అనంతపల్లికి చెందిన బైరి బాబు(48)–లత దంపతులకు ఇద్దరు కూతుళ్లు. చిన్నకూతురు అదే గ్రామానికి చెందిన యువకుడిని ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో చిన్నకూతురిని మరిచిపోదామని ఆ దంపతులు నిశ్చయించుకున్నారు. అయితే చిన్నకూతురుకు గురువారం పాప పుట్టింది. ఈ విషయం తెలుసుకున్న బాబు భార్య లత ఆస్పత్రికి వెళ్లి చూసి వచ్చింది. ఈ విషయం తెలిసిన బాబు మనస్థాపానికి గురై ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి మరణాన్ని తట్టుకోలేక కొడుకు మృతి


లింగమూర్తి (ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): తండ్రి మరణాన్ని తట్టుకోలేక మనోవేదనతో కొడుకు మృతిచెందిన సంఘటన మండలంలోని భూక్యతండాలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. భూక్య శంకర్(48) తన కొడుకు ఆరోగ్యం బాగు చేయించేందుకు రూ.10 లక్షల వరకు అప్పులు చేసి.. వాటిని తీర్చే మార్గం కనిపించక గత వారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. తండ్రి మరణించినప్పటి నుంచి కొడుకు లింగమూర్తి(36) మానసిక వేదనకు గురవుతున్నాడు. తండ్రి లేని లోటు తాను భరించలేనని గురువారం ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. వారం రోజుల వ్యవధిలో తండ్రీకొడుకుల మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. మృతుడికి తల్లి రేణ, భార్య కవిత, కూతురు అశ్విత, కొడుకు వంశీ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడిన యువకుడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాచర్లగొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేటకు ద్విచక్ర వాహనంపై వస్తున్న అక్కపల్లికి చెందిన రాజును ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లికి వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ రాజును స్థానికులు 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టర్‌పై పేపర్ అతికించిన సిబ్బంది



రాయికల్(జగిత్యాల): పట్టణంలోని ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం వద్ద ప్రధాని మోదీ ఉన్న పోస్టర్‌పై గురువారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సభ్యులు పేపర్ అతికించారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యేంతవరకు పోస్టర్ల అతికించవద్దని ఆదేశించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- మొదలైన వేడుకలు
- ముస్తాబైన వేణుగోపాలుడి ఆలయం
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ
- సిద్ధమైన పెద్దరథం
- వెలసిన దుకాణాలు


ఉత్సవాలకు అలంకరించిన ఆలయం


ముస్తాబైన పెద్ద రథం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బ్రహ్మోత్సవాలకు మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ముస్తాబైంది. పెద్దరథానికి రంగులు వేయడం తోపాటు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. కార్తీక మాసంలో ఏటా అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈసారి అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నాయకులు సైతం హడావిడి చేస్తున్నారు. వారం రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఈనెల 22న మొదలై 27వ తేదీ వరకు కొనసాగుతాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం పెద్దరథం ఊరేగింపు ఆకర్షణగా ఉంటుంది.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ఇలా..

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22న ఆలయ సంప్రోక్షణతో పండితులు ప్రారంభించారు. ఈనెల 23, 24న రెండు రోజులు సాధారణ పూజలు ఉండగా, 25 నుంచి ప్రధాన ఘట్టం ప్రారంభంకానుంది. ఈనెల 25న ఉదయం ఎదుర్కోళ్లు, శ్రీరుక్మిణీ– సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి అశ్వవాహనంపై స్వామి వారి ఊరేగింపు తీస్తారు. 26న హనుమాన్ వాహనంపై ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, 27న మరో ప్రధాన ఘట్టం స్వామివారి పెద్దరథాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగిస్తారు. అదే రోజు రాత్రి కార్తీకమాసం జాతర నిర్వహిస్తారు. రాత్రి 11.30 గంటలకు స్వామి వారి ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు వేదపండితులు వివరించారు.

ఆరు జిల్లాల నుంచి..

ఎల్లారెడ్డిపేటలో జరిగే బ్రహ్మోత్సవాలు చూసేందుకు హైదరాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల నుంచి వారం రోజులు నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈనెల 25, 27 తేదీలలో ఆరు జిల్లాలకు చెందిన భక్తులు ఎక్కువగా హా జరవుతారు. తండాల నుంచి గిరిజనులు పెద్ద సంఖ్యలో వస్తారు. బ్రహ్మోత్సవాలకు ముందుగానే ఆ సమీపంలో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన యంత్రాలు ఏర్పాటయ్యాయి. సర్కస్‌ను తలదన్నేలా జాయింట్‌వీల్(రంగుల రాట్నం), చిన్నపిల్లలు ఆడుకునే అనేక రకాల పరికరాలు ఏర్పాటు చేశారు. మిఠాయి దుకాణాలు వెలిశాయి.

ఉత్సవాలపై పోలీసుల కన్ను

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ కమిటీ పాలకవర్గాన్ని మార్చడంతో పాత, నూతన కమిటీల మధ్య అభిప్రాయబేధాలు చోటు చేసుకున్నాయి. రెండు కమిటీలు కూడా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ప్రకటించడంతో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసులు అన్ని చర్యలు చేపట్టారు. ఉత్సవాలు ముగిసే వరకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
24-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
5	10
66,018	19,802

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,266	▲	66
డోజోన్స్	35,273	▽	185
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,484	▲	14
డాక్స్	15,995	▲	37
షాంఘై	3,062	▲	18
నికాయ్	33,452	▲	98

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,394	▽	222
బంగారం (99.5 స్వచ్ఛత)	61,148	▽	221
వెండి (కిలో)	73,065	▽	400

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎంతం	82.53	84.20
£	బ్రిటన్ పౌండ్	ఎంతం	102.55	105.90
€	యూరో	ఎంతం	89.35	92.43
¥	జపాన్ ఎన్ (100)	ఎంతం	62.71	64.78
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎంతం	53.43	55.78
S$	సింగపూర్ డాలర్	ఎంతం	61.81	63.86
SAR	సౌదీ రియాల్	ఛాయసికి	21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయసికి	21.79	23.59
¥	చైనా యువాన్	ఛాయసికి	10.55	12.62

ఏటా 10 శాతం చొప్పున జీవితాంతం

- డిసెంబర్‌లో ఎల్‌ఐసీ కొత్త ప్లాన్
- మూడు–నాలుగు కొత్త పాలసీలకు ప్రణాళికలు



న్యూఢిల్లీ: జీవిత బీమా రంగ దిగ్గజం ఎల్‌ఐసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడు నుంచి నాలుగు వరకు నూతన పాలసీలను ఆవిష్కరించనుంది. నూతన వ్యాపార ప్రీమియంలో రెండంకెల వృద్ధిని సాధించాలనే లక్ష్యంతో ఉంది. ''గతేడాదితో పోలిస్తే రెండంకెల వృద్ధిని సాధిస్తాం. ఎందుకంటే ఇండివిడ్యువల్ రిటైల్ వ్యాపారం పుంజుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆకర్షణీయమైన కొత్త పాలసీలను ఆవిష్కరించనున్నాం''అని ఎల్‌ఐసీ చైర్మన్ సిద్ధార్థ మహంతి తెలిపారు. డిసెంబర్ మొదటి వారంలో ఎల్‌ఐసీ ఒక ఉత్పత్తిని తీసుకువస్తుందని వెల్లడించారు. దీనితో మార్కెట్లో మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. డిసెంబర్‌లో తెచ్చే నూతన పాలసీ గురించి వివరిస్తూ.. పాలసీ మెచ్యూరిటీ తర్వాత (గడువు ముగిసిన అనంతరం) జీవితాంతం ఏటా సమ్ అష్యూర్డ్‌లో (బీమా కవరేజీలో) 10 శాతం చొప్పున లభిస్తుందని తెలిపారు. ఇది మార్కెట్లో సంచలనాన్ని సృష్టిస్తుందన్నారు. 20–25 ఏళ్ల తర్వాత ఎంత చొప్పున వస్తుంది, ఎంత ప్రీమియం చెల్లించాలన్నది తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపిస్తారని పేర్కొన్నారు. ఈ ప్లాన్‌పై రుణ సదుపాయం, ముందస్తు ఉపసంహరణకూ అవకాశం ఉంటుందన్నారు. హామీతో కూడిన రాబడులు ఇచ్చే పాలసీలకు పాలసీదారులు, వాటాదారులు ఆసక్తి చూపిస్తున్నారని చెబుతూ.. తమ కంపెనీ వాటాదారుల్లో చాలా మంది పాలసీదారులుగా ఉన్నట్టు మహంతి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) నూతన వ్యాపార ప్రీమియం (ఇండివిడ్యువల్) 2.65 శాతమే వృద్ధి చెంది రూ.25,184 కోట్లకు చేరుకోవడం గమనార్హం.

అమెజాన్‌తో వాణిజ్య శాఖ ఒప్పందం

చిన్న సంస్థలకు ఎగుమతులపై శిక్షణ



న్యూఢిల్లీ: దేశీయంగా 20 జిల్లాల్లోని చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) శిక్షణ కల్పించే దిశగా ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. దీని ప్రకారం ఈ–కామర్స్ మాధ్యమం ద్వారా ఎగుమతులను ప్రోత్సహించే దిశగా ఇమేజింగ్, డిజిటల్ క్యాటలాగ్‌లను రూపొందించడం, పన్నుల సంబంధమైన అంశాలను తెలుసుకోవడం మొదలైన వాటికి ఈ శిక్షణ ఉపయోగపడగలదని పేర్కొంది. ఎగుమతుల హబ్‌లుగా గుర్తించిన జిల్లాల్లో అమెజాన్, డీజీఎఫ్‌టీ కలిసి శిక్షణ, వర్క్‌షాప్‌లను నిర్వహిస్తాయి. ఇతర జిల్లాల్లోనూ ఇదే తరహా కార్యక్రమాల కోసం ఫ్లిప్‌కార్ట్, ఈబే, రివెక్స్, షిప్‌రాకెట్, షాప్‌క్లూస్ వంటి వివిధ ఈ–కామర్స్ సంస్థలతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) చర్చలు జరుపుతున్నట్లు వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో వివరించింది. ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా దేశీ సంస్థలు అంతర్జాతీయంగా మరిన్ని ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ఒప్పందాలు ఉపయోగపడతాయి. 2030 నాటికి ఈ–కామర్స్ ద్వారా 350 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను ఎగుమతి చేయాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకోవాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్‌ఐ) ఇటీవల ఒక నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం ఇవి 2 బిలియన్ డాలర్లుగా మాత్రమే ఉన్నాయి. ఎగుమతులను సరళతరం చేయడం, 2025 నాటికి ఈ–కామర్స్ ఎగుమతులను 20 బిలియన్ డాలర్లకు చేర్చడంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు అమెజాన్ ఇండియా డైరెక్టర్ భూపేన్ వాకంకర్ తెలిపారు.

ఇరెడా ఐపీవో సక్సెస్



చివరి రోజుకల్లా 39 రెట్లు అధిక బిడ్స్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మినీరత్న సంస్థ ఇండియన్ రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐఆర్‌ఈడీఏ–ఇరెడా) పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు గురువారానికల్లా 39 రెట్లు అధిక స్పందన నమోదైంది. కంపెనీ 47 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 1,827 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు దాఖలయ్యాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 24 రెట్లు, రిటైలర్ల నుంచి దాదాపు 8 రెట్లు అధికంగా బిడ్స్ లభించాయి. అర్హతగల కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో అయితే దాదాపు 105 రెట్లు అధికంగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. రూ. 30–32 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూలో భాగంగా సోమవారం(20న) యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 643 కోట్లు సమీకరించిన సంగతి తెలిసిందే.

ఈక్విటీ వివరాలిలా

ఐపీవోలో భాగంగా 40.31 కోట్ల ఈక్విటీ షేర్లను ఇరెడా తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా కంపెనీ ప్రమోటర్ కేంద్ర ప్రభుత్వం 26.88 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచింది. ఈక్విటీ జారీతో రూ. 1,290 కోట్లు, ప్రభుత్వ వాటాకు రూ. 860 కోట్ల చొప్పున లభించనున్నాయి. వెరసి ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ. 2,150 కోట్లు సమకూర్చుకోనుంది. గతేడాది మే నెలలో బీమా రంగ దిగ్గజం ఎల్‌ఐసీ లిస్టింగ్ తదుపరి మళ్లీ ప్రభుత్వ రంగ సంస్థ పబ్లిక్ ఇష్యూకి రావడం విశేషం! కాగా.. ఈక్విటీ జారీ నిధులను కంపెనీ భవిష్యత్ పెట్టుబడి అవసరాలరీత్యా మూలధన పటిష్టతకు వినియోగించనుంది.

ప్యూర్ ఈవీ నుంచి ఎకోడ్రిఫ్ట్ బైక్

ధర రూ. 1,29,999



హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల సంస్థ ప్యూర్ ఈవీ తమ కొత్త మోటార్ సైకిల్ వేరియంట్ ఎకోడ్రిఫ్ట్ 350ని ఆవిష్కరించింది. దీన్ని ఒక్కసారి చార్జి చేస్తే 171 కి.మీ. వరకు ప్రయాణించగలదు. ప్రతి రోజూ ఎక్కువ దూరాలు ప్రయాణించే వినియోగదారులకు ఇది ఎంతో అనువుగా ఉంటుందని సంస్థ తెలిపింది. దీనితో నెలవారీగా రూ. 7,000 పైచిలుకు ఆదా కాగలదని వివరించింది. దీని ధర రూ. 1,29,999గా ఉంటుందని ప్యూర్ సహ వ్యవస్థాపకుడు రోహిత్ వదేరా తెలిపారు. సులభతరమైన ఈఎంఐ సదుపాయం రూ. 4,000 నుంచి ఉంటుందని పేర్కొన్నారు. 110 సీసీ సెగ్మెంట్‌లో హీరో స్ప్లెండర్, హోండా షైన్, బజాజ్ ప్లాటినా వంటి మోటార్‌సైకిల్స్‌తో దీటుగా పోటీపడగలిగేలా దీన్ని తీర్చిదిద్దినట్లు వివరించారు. ఇందులో రివర్స్ మోడ్, హిల్ స్టార్ట్ అసిస్ట్, డౌన్ హిల్ అసిస్ట్ వంటి ఫీచర్లు కూడా ఉన్నాయి. 75 కి.మీ. గరిష్ఠ వేగంతో ప్రయాణించగలదు.

ఫేమ్ ఉల్లంఘనలపై విచారణ

నెల రోజుల్లో నివేదిక; తర్వాత చర్యలు



న్యూఢిల్లీ: ఫేమ్–2 స్కీము నిబంధనల ఉల్లంఘనలో అధికారులపరంగా తప్పిదాలు జరిగాయన్న ఆరోపణలపైనా కేంద్రం దృష్టి పెట్టింది. వాటితో పాటు వేలిడేషన్, టెస్టింగ్ ఏజెన్సీలైన ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్‌ఏఐ), ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ (ఐసీఏటీ) అధికారుల పాత్రపైనా కేంద్ర భారీ పరిశ్రమల శాఖ విచారణ ప్రారంభించింది. దీనికి సంబంధించి నెల రోజుల వ్యవధిలో నివేదిక రావచ్చని శాఖ కార్యదర్శి కమ్రాన్ రిజ్వి తెలిపారు. ఆ తర్వాత ఉల్లంఘనలకు బాధ్యులైన వారితో పాటు సిస్టమ్స్‌ను కూడా సరిదిద్దే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. స్థానికంగా తయారీని, విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు.. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలకు సబ్సిడీలు ఇచ్చేలా కేంద్రం రూ. 10,000 కోట్లతో ఫేమ్–2 స్కీమును ప్రవేశపెట్టింది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా పలు కంపెనీలు పెద్ద స్థాయిలో దిగుమతి చేసుకుంటున్నాయని, ఏడు సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ప్రోత్సాహకాలు పొందాయని ఆరోపణలొచ్చాయి.

ఆచితూచి రుణాలివ్వండి..!

- ఎన్‌బీఎఫ్‌సీలకు కేంద్ర ఆర్థిక మంత్రి సూచన
- అత్యుత్సాహం ప్రదర్శించొద్దని హితవు



డేటా సురక్షితం

అకౌంట్ అగ్రిగేటర్లతో (ఏఏ) పంచుకునే కస్టమర్ల డేటా దేశంలో పూర్తి సురక్షితంగా ఉంటుందని మంత్రి సీతారామన్ హామీనిచ్చారు. డేటా భద్రత విషయంలో వ్యక్తమవుతున్న ఆందోళనను తొలగించే ప్రయత్నం చేశారు. ''అకౌంట్ అగ్రిగేటర్లు డేటా బ్యాంక్ కలిగి ఉంటారనే అభిప్రాయాలు ఉండేవి. నిజానికి వారు డేటా కలిగి ఉండరు. వారి ద్వారా డేటా బదిలీ అవుతుంది. ఏఏ ద్వారా బ్యాంక్ కానీ, కస్టమర్ కానీ డేటా కలిగి ఉండరు. కేవలం రుణాల మంజూరీకే దీన్ని వినియోగించుకుంటారు''అని మంత్రి చెప్పారు.

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ సూచించిన విధంగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు రుణ వితరణలో అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఎర్రటి గీతను (హద్దులను/పరిమితులను) గౌరవించాలని, అత్యుత్సాహంతో దూకుడుగా వ్యవహరించరాదని కోరారు. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్‌కార్డ్ రుణ విభాగంలో (అన్‌సెక్యూర్డ్) బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు గడిచిన కొన్నేళ్లలో భారీ వృద్ధిని చూపిస్తుండడం తెలిసిందే. ఫలితంగా ఈ విభాగంలో ఎన్‌పీఏలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో రిస్క్ నియంత్రణకు గాను ఆర్‌బీఐ ఇటీవలే నిబంధనలు కఠినతరం చేయడం తెలిసే ఉంటుంది. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల రుణాలకు గాను రిస్క్ వెయిటేజీని 0.25 శాతం మేర పెంచింది. దీనివల్ల బ్యాంకుల వరకే రూ.84,000 కోట్లను అదనంగా పక్కన పెట్టాల్సి రావచ్చని అంచనా. 'డేట్ విత్ టెక్' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి సీతారామన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ''ఉత్సాహం మంచిదే. కానీ, కొన్ని సందర్భాల్లో ఇదీ మరీ ఎక్కువైతే జీర్ణించుకోవడం కష్టం. దీంతో జాగ్రత్తగా ఉండాలని, దూకుడుగా వ్యవహరించడం ద్వారా తర్వాత రిస్కులు చవిచూడొద్దన్న ఉద్దేశంతోనే ఆర్‌బీఐ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలను అప్రమత్తం చేసింది'' అని మంత్రి సీతారామన్ వివరించారు.

ఆరంభ లాభాలు ఆవిరి..



ముంబై: ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు గురువారం చివరికి స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 5 పాయింట్లు నష్టపోయి 66,018 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10 పాయింట్లు పతనమై 19,802 వద్ద నిలిచింది. ఫార్మా, ఐటీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ఆరంభ లాభాలను నిలుపుకోవడంలో విఫలమయ్యాయి. ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంధన, రియల్టీ, టెలికం, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున రాణించాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. ''నిఫ్టీ 19,800 స్థాయిని దాటి ముందుకెళ్లేందుకు ప్రోత్సాహానిచ్చే కీలక పరిణామాలేవీ లేకపోవడంతో పరిమిత శ్రేణి ట్రేడింగ్ రెండోరోజూ కొనసాగింది. క్రూడాయిల్ ధరలు, బాండ్లపై రాబడులు దిగిరావడం వంటి అంశాలు దేశీయ మార్కెట్ పతనాన్ని అడ్డుకుంటున్నాయి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో రష్మిక

మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి... డబుల్స్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 21 ఏళ్ల రష్మిక 4–6, 7–5, 7–5తో నాలుగో సీడ్ వైదేహి (గుజరాత్)ను ఓడించింది. 2 గంటల 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక నాలుగు ఏస్‌లు సంధించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన రష్మిక తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక–వైదేహి (భారత్) జోడీ 6–0, 6–3తో కశిష్ భాటియా–వన్షిత (భారత్) జంటపై నెగ్గింది. హైదరాబాద్‌కే చెందిన యడ్లపల్లి ప్రాంజల పోరాటం ఈ టోర్నీలో ముగిసింది. సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రాంజల 4–6, 3–6తో రుతుజా భోస్లే (భారత్) చేతిలో ఓడిపోయింది.

ప్రణయ్ ముందంజ



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 21–12, 21–18తో మాగ్నస్ జొహాన్‌సెన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మరోవైపు పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ 21–15, 21–16తో అకీరా కొగా–తైచి సైటో (జపాన్) జంటపై గెలిచింది.

రన్నరప్ హారిక



సాక్షి, హైదరాబాద్: జూలియస్ బేర్ అంతర్జాతీయ మహిళల ఆన్‌లైన్ స్పీడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక రన్నరప్‌గా నిలిచింది. చైనా గ్రాండ్‌మాస్టర్ హు ఇఫాన్‌తో జరిగిన ఫైనల్లో హారిక 11–15 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. విజేతగా నిలిచిన హు ఇఫాన్‌కు 15,769 డాలర్లు (రూ. 13 లక్షల 13 వేలు), రన్నరప్ హారికకు 4,230 డాలర్లు (రూ. 3 లక్షల 52 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఐపీఎల్‌కు స్టోక్స్ దూరం



చెన్నై: ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్, చెన్నై సూపర్ కింగ్స్ జట్టు సభ్యుడు బెన్ స్టోక్స్ వచ్చే ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నుంచి వైదొలిగాడు. పనిభారాన్ని తగ్గించుకోవడానికి స్టోక్స్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. వచ్చే ఏడాది ఐపీఎల్ కంటే ముందు భారత జట్టుతో ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత జూన్‌లో టి20 వరల్డ్‌కప్ ఉంది. ఈ నేపథ్యంలో పూర్తి ఫిట్‌గా ఉండాలనే ఉద్దేశంతో స్టోక్స్ ఐపీఎల్ నుంచి తప్పుకున్నాడు. స్టోక్స్‌ను చెన్నై ఫ్రాంచైజీ రూ. 16 కోట్ల 25 లక్షలకు తీసుకోగా అతను ఈ ఐపీఎల్ సీజన్‌లో కేవలం రెండు మ్యాచ్‌లు ఆడి మోకాలి గాయంతో మిగతా టోర్నీకి దూరమయ్యాడు.

ఆఖరి బంతికి గట్టెక్కాం

- ఉత్కంఠపోరులో భారత్ విజయం
- కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన సూర్యకుమార్
- రాణించిన ఇషాన్, రింకూ సింగ్
- తొలి టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓటమి
- ఇన్‌గ్లిస్ సెంచరీ వృథా
- 26న రెండో టి20 మ్యాచ్


సూర్య

సాక్షి, విశాఖపట్నం: పరుగుల వరద పారిన మ్యాచ్‌లో చివరికి భారత జట్టుదే పైచేయిగా నిలిచింది. ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. గురువారం ఇక్కడి డాక్టర్ వైఎస్‌ఆర్–ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని భారత జట్టు రెండు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా జట్టును ఓడించింది. తొలిసారి జాతీయ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన మ్యాచ్‌లో సూర్యకుమార్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 208 పరుగులు సాధించింది. జోష్ ఇంగ్లిస్ (50 బంతుల్లో 110; 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) అంతర్జాతీయ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా... ఓపెనర్‌గా వచ్చిన స్టీవ్ స్మిత్ (41 బంతుల్లో 52; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 130 పరుగులు జోడించారు. ఇన్‌గ్లిస్ 47 బంతుల్లో సెంచరీ చేశాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా తరఫున టి20ల్లో వేగవంతమైన సెంచరీ చేసిన ప్లేయర్‌గా ఆరోన్ ఫించ్ (47 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు. అనంతరం భారత జట్టు 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (42 బంతుల్లో 80; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (39 బంతుల్లో 58; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు)– అర్ధ సెంచరీలతో అదరగొట్టగా... రింకూ సింగ్ (14 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు) ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. భారత్ విజయానికి ఆఖరి బంతికి ఒక పరుగు అవసరంకాగా... సీన్ అబాట్ వేసిన బంతిని రింకూ సింగ్ సిక్సర్‌గా మలిచి భారత విజయాన్ని ఖరారు చేశాడు. అయితే టీవీ రీప్లేలో అబాట్ వేసిన బంతి నోబాల్ అని తేలడంతో అక్కడే భారత విజయం ఖాయమైంది. దాంతో రింకూ సింగ్ సిక్స్‌ను లెక్కలోకి తీసుకోలేదు. టి20ల్లో భారత జట్టుకిదే అత్యధిక ఛేజింగ్ కావడం విశేషం. సిరీస్‌లోని రెండో టి20 మ్యాచ్ ఈనెల 26న తిరువనంతపురంలో జరుగుతుంది.


జోష్ ఇన్‌గ్లిస్

సూర్య, ఇషాన్ ధనాధన్

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు శుభారంభం లభించలేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (8 బంతుల్లో 21; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో సమన్వయలోపం కారణంగా మరో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (0) ఒక్క బంతి ఆడకుండానే తొలి ఓవర్లోనే రనౌటయ్యాడు. అనంతరం మూడో ఓవర్లో యశస్వి భారీ షాట్‌కు యత్నించి నిష్క్రమించాడు. ఈ దశలో ఇషాన్, సూర్యకుమార్ జత కలిశారు. వీరిద్దరు ఎక్కడా తగ్గకుండా ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. దాంతో భారత్ స్కోరు 4.5 ఓవర్లలో 50 దాటింది. పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 2 వికెట్లకు 63 పరుగులు సాధించింది. ఆ తర్వాత కూడా ఇషాన్, సూర్య జోరు కొనసాగించడంతో భారత్ 9.1 ఓవర్లలో 100 పరుగులు చేసింది. ఇషాన్ 37 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇన్నింగ్స్ 13వ ఓవర్లో భారీ షాట్‌కు యత్నించి డీప్ ఎక్స్‌ట్రా కవర్‌లో షార్ట్ చేతికి చిక్కడంతో ఇషాన్ ఇన్నింగ్స్ ముగిసింది. తిలక్ వర్మ (10 బంతుల్లో 12; 2 ఫోర్లు) ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. ఈ దశలో సూర్య, రింకూ జతకలిసి ఐదో వికెట్‌కు 40 పరుగులు జోడించడంతో భారత్ 194/4తో విజయానికి చేరువైంది. అయితే ఇదే స్కోరు వద్ద సూర్య అవుటయ్యాడు. అప్పటికి భారత్ విజయానికి చేరువైంది.

చివరి ఓవర్ డ్రామా...

12 బంతుల్లో 14 పరుగులు చేయాల్సిన దశలో 19వ ఓవర్లో భారత్ 7 పరుగులు చేసింది. దాంతో చివరి ఓవర్లో భారత్ గెలుపునకు 6 బంతుల్లో 7 పరుగులు అవసరమయ్యాయి. తొలి బంతికే రింకూ ఫోర్ కొట్టాడు. రెండో బంతికి 'బై' రూపంలో పరుగు వచ్చింది. 4 బంతుల్లో 2 పరుగులు చేయాల్సిన దశలో భారత్ వరుసగా మూడు బంతుల్లో అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ వికెట్లను కోల్పోయింది. రెండో పరుగు పూర్తి చేసే క్రమంలో అర్ష్‌దీప్ అవుటయ్యాడు. దాంతో చివరి బంతికి భారత్ విజయానికి ఒక పరుగు అవసరమైంది. 'సూపర్ ఓవర్' అవసరం పడుతుందా అనే అనుమానం కలిగిన దశలో అబాట్ వేసిన ఆఖరి బంతిని రింకూ సిక్స్‌గా మలచడంతో భారత్ విజయం ఖరారైంది. అయితే అబాట్ బంతి నోబాల్ అని తేలడంతో రింకూ సిక్స్ షాట్‌ను పరిగణనలోకి తీసుకోలేదు.


ఇషాన్

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: స్టీవ్ స్మిత్ (రనౌట్) 52; మాథ్యూ షార్ట్ (బి) రవి బిష్ణోయ్ 13; జోష్ ఇన్‌గ్లిస్ (సి) యశస్వి జైస్వాల్ (బి) ప్రసిధ్ కృష్ణ 110; స్టొయినిస్ (నాటౌట్) 7; టిమ్ డేవిడ్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 208. వికెట్ల పతనం : 1–31, 2–161, 3–180. బౌలింగ్: అర్ష్‌దీప్ సింగ్ 4–0–41–0, ప్రసిధ్ కృష్ణ 4–0–50–1, అక్షర్ పటేల్ 4–0–32–0, రవి బిష్ణోయ్ 4–0–54–1, ముకేశ్ కుమార్ 4–0–29–0.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) స్మిత్ (బి) షార్ట్ 21; రుతురాజ్ గైక్వాడ్ (రనౌట్) 0; ఇషాన్ కిషన్ (సి) షార్ట్ (బి) తన్వీర్ 58; సూర్యకుమార్ యాదవ్ (సి) ఆరన్ హార్డి (బి) బెహ్రెన్‌డార్ఫ్ 80; తిలక్ వర్మ (సి) స్టొయినిస్ (బి) తన్వీర్ సంఘా 12; రింకూ సింగ్ (నాటౌట్) 22; అక్షర్ పటేల్ (సి అండ్ బి) సీన్ అబాట్ 2; రవి బిష్ణోయ్ (రనౌట్) 0; అర్ష్‌దీప్ సింగ్ (రనౌట్) 0; ముకేశ్ కుమార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (19.5 ఓవర్లలో 8 వికెట్లకు) 209. వికెట్ల పతనం: 1–11, 2–22, 3–134, 4–154, 5–194, 6–207, 7–207, 8–208. బౌలింగ్: స్టొయినిస్ 3–0–36–0, బెహ్రెన్‌డార్ఫ్ 4–1–25–1, షార్ట్ 1–0–13–1, సీన్ అబాట్ 3.5–0–43–1, నాథన్ ఎలిస్ 4–0–44–0, తన్వీర్ సంఘా 4–0–47–2.

సామ్యూల్స్‌పై ఆరేళ్ల నిషేధం



దుబాయ్: అవినీతి నిరోధక నియమావళిని ఉల్లంఘించినందుకు వెస్టిండీస్ మాజీ క్రికెటర్ మార్లోన్ సామ్యూల్స్‌పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆరేళ్ల నిషేధం విధించింది. 2019లో అబుదాబిలో జరిగిన టి10 లీగ్ సందర్భంగా సామ్యూల్స్ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి లబ్ధి పొందాడని... ఎన్నిసార్లు అతడిని విచారించినా వాటికి సంబంధించిన వివరాలు ఇవ్వకపోవడంతో నిషేధం విధిస్తున్నట్లు ఐసీసీ తెలిపింది. 42 ఏళ్ల సామ్యూల్స్ 2012, 2016లలో టి20 ప్రపంచకప్ సాధించిన వెస్టిండీస్ జట్టులో కీలక సభ్యుడిగా వ్యవహరించాడు. 2008లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడటంతో రెండేళ్ల నిషేధానికి గురైన సామ్యూల్స్ వెస్టిండీస్ తరఫున 71 టెస్టులు (3917 పరుగులు; 41 వికెట్లు), 207 వన్డేలు (5606 పరుగులు; 89 వికెట్లు), 67 టి20 మ్యాచ్‌లు (1611 పరుగులు; 22 వికెట్లు) ఆడాడు.

హైదరాబాద్ బోణీ


రాహుల్

జైపూర్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు శుభారంభం చేసింది. మణిపూర్ జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన మణిపూర్ సరిగ్గా 50 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ (3/71), రక్షణ్ రెడ్డి (2/28), తనయ్ త్యాగరాజన్ (2/24) రాణించారు. అనంతరం హైదరాబాద్ కేవలం 29.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి నెగ్గింది. హైదరాబాద్ కెప్టెన్ గౌహత్ రాహుల్ సింగ్ (47 బంతుల్లో 70; 13 ఫోర్లు), చందన్ సహని (32 బంతుల్లో 41; 4 ఫోర్లు, 1 సిక్స్), రవితేజ (11 బంతుల్లో 23 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు.

ఆంధ్ర పరాజయం

మరోవైపు చండీగఢ్‌లో ఆంధ్ర జట్టు పరాజయంతో ఈ టోర్నీని ప్రారంభించింది. గ్రూప్ 'డి'లో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ముందుగా ఆంధ్ర జట్టు 47.3 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ రెడ్డి (59 బంతుల్లో 47; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మనీశ్ గోలమారు (60 బంతుల్లో 46; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం హిమాచల్ ప్రదేశ్ 43.3 ఓవర్లలో 3 వికెట్లకు 212 పరుగులు చేసి విజయం సాధించింది. అమిత్ (78 నాటౌట్; 11 ఫోర్లు), ఆకాశ్ వశిష్ట్ (53; 2 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు.